క్లుప్తంగా

మొరం టిప్పర్లు పట్టివేత

భైంసారూరల్: మండలంలోని మాటేగాం గ్రామం నుంచి భైంసాకు అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. గురువారం పక్కా సమాచారంతో వెళ్లి దాడి చేయగా ఓ టిప్పర్ తప్పించుకొని వెళ్లిపోగా మరో రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. అందులో ఓ టిప్పర్‌కు రూ.ఐదు వేల జరిమానా విధించగా మరో టిప్పర్‌ను భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అనుమతుల్లేకుండా వాహనాల్లో మొరం తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ కృష్ణాగౌడ్ పేర్కొన్నారు.

'బచ్పన్'లో ఫ్రూట్స్ డే



పండ్లను ప్రదర్శిస్తున్న చిన్నారులు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బచ్పన్ పాఠశాలలో గురువారం ఫ్రూట్స్ డే నిర్వహించారు. వివిధ రకాల పండ్లను ప్రదర్శించారు. తాజా ఫ్రూట్స్(పండ్లు) తింటే ఆరోగ్యంగా ఉంటామని ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అయన్నగారి రచన, కరస్పాండెంట్ శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

లోకేశ్వరం: మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు నరేశ్‌గౌడ్ తోపాటు 20 మంది గురువారం కాంగ్రెస్‌లో చేరారు. భైంసాలోని ఆ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ వారికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం సుదర్శన్ రెడ్డి, సుధీర్‌రెడ్డి, భోజన్న ఉన్నారు.

20 మందికి జరిమానా

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారిపై గురువారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా హెల్మెట్ ధరించని 20 మందికి జరిమానా విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు.

ఎంపీడీవోకు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న సభ్యులు

సోన్: పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసిన మండల కేంద్రం మాజీ సర్పంచ్ వినోద్ కుమార్, కార్యదర్శి లక్ష్మణ్‌పై చర్యలు తీసుకోవాలని గురువారం ఎంపీడీవో మోహన్‌రెడ్డికి సోన్ వీడీసీ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరిస్తామని ఇరువైపుల చెట్లను తొలగించి అమ్ముకున్నారని ఆరోపించారు. కోతుల బెడద నివారించేందుకు వీడీసీ వద్ద డబ్బులు తీసుకున్నారని అన్నారు. గ్రామ కంఠం భూములను లక్షల రూపాయలకు అమ్ముకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజేశ్వర్, శ్రీనివాస్, దోషన్న, గంగయ్య, చిన్నయ్య, గంగాధర్, రాజు, వీడీసీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలి

భైంసారూరల్: 19 ఏళ్లలోపున్న వారికి నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని భైంసా ఎంపీపీ అబ్దుల్ రజాక్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వైద్యాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 12న నులి పురుగుల నివారణ దినం సందర్భంగా మాత్రలు అందించాలని కోరారు. సమావేశంలో హెచ్‌ఈఓ సలీం, ఎంఈఓ సుభాష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పారిశుధ్య పనులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో గురువారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. మురికి కాలువలపై నిర్మించిన స్లాబ్, కల్వర్టులను పొక్లెయిన్ సాయంతో తొలగించారు. అనంతరం పారిశుధ్య సిబ్బంది చేత మురికి కాలువల్లో పూడిక, చెత్తాచెదారం తొలగించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

పెంబి: ప్లాస్టిక్ వినియోగిస్తే రోగాల బారిన పడతామని ఎంపీవో, మందపల్లి, పస్పుల, హరిచంద్‌తండా, కోరకంటి తండాల ప్రత్యేకాధికారి రత్నాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని మందపల్లి, పస్పుల, హరిచంద్‌తాండ గ్రామాల్లో చేస్తున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. మందపల్లిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ తీశారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి సుజాత, ఎఫ్ఏ భూమన్న, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బాబోయ్ గ్రామసింహాలు

- మూగజీవాలు, మనుషులపై దాడులు చేస్తున్న వైనం
- వీధుల్లో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు
- బయటకు వచ్చేందుకు జంకుతున్న జనం
- నియంత్రణ చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులకు వేడుకోలు



కుంటాలలో సంచరిస్తున్న వీధికుక్కలు (ఫైల్)

కుంటాల: ఒకప్పుడు కొత్తవారు కన్పిస్తే అరిచే కుక్కలు.. నేడు స్థానికులనే హడలెత్తిస్తున్నాయి. మండలంలోని గ్రామాల్లో గుంపులుగుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పాదచారులు, వాహనదారులతోపాటు మూగజీవాలపై కూడా దాడులు చేస్తున్నాయి. వీధుల్లో వీటి సంచారం ఎక్కువ కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. వీధికుక్కల నియంత్రణ బాధ్యత పంచాయతీలదే. కానీ వీటి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నా.. సంతానోత్పత్తిని నియంత్రించే చర్యలను అధికారులు చేపట్టడం లేదు.

జరిగిన ఘటనలు ఇవీ..

నాలుగు రోజుల కిందట అందాకూర్, సూర్యాపూర్, ఓలా, కుంటాల గ్రామాల్లో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేశాయి.

కుంటాలలో పోస్టల్ ఉద్యోగి ఎండీ హైమద్, ఆటో దశరథ్, కటికె వంశీ, విద్యార్థి గణేశ్‌పై పిచ్చికుక్క దాడి చేసింది. సూర్యాపూర్‌లో రిక్కల సుదర్శన్, బక్కి శ్రీకాంత్, బక్కి మమత కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. కుక్క వెంబడించడంతో పరుగెత్తిన రొడ్డ గంగాప్రసాద్ కాలు విరిగింది. రొడ్డ మల్లేశ్, బక్కి సాయినాథ్ ఎడ్లపై కుక్కలు దాడి చేశాయి. బాధితులను మెరుగైన వైద్యం కోసం నిర్మల్, భైంసా వైద్యశాలలకు తరలించారు.

ఇటీవల సూర్యాపూర్‌లోనూ ఎడ్లపై దాడి చేయడంతో మూగజీవాలు తీవ్రంగా గాయపడ్డాయి.

ఆరు మాసాల కిందట కుంటాలలో కుక్కల దాడిలో ముత్తెవ్వ, నాగులపెల్లి నాగారావు గాయపడ్డారు.

భయాందోళనలో ప్రజలు..

వీధికుక్కలు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఇంటి నుంచి వెళ్లేటప్పుడు కర్రలు వెంట తీసుకెళ్లాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి పిచ్చికుక్కలు, ఊర కుక్కల బెడద నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఈ చిత్రంలో మంచంపై పడుకొన్న వ్యక్తి కుంటాల మండలం సూర్యాపూర్‌కు చెందిన రొడ్డ గంగాప్రసాద్. ఇటీవల పిచ్చికుక్క తరమడంతో కిందపడ్డాడు. కాలు విరిగింది. ప్రస్తుతం నడవలేనిస్థితిలో ఇలా మంచానికి పరిమితమయ్యాడు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- సాధారణంగా ఒంటరిగా ఉన్న కుక్క ఇతరులపై దాడి చేయదు. గుంపులుగా ఉన్న సమయంలో రెచ్చిపోతాయి..కుక్కల గుంపు ఉన్న వైపు వెళ్లకపోవడం మంచిది.
- చిన్నారులు బయట ఆడుకునేటప్పుడు పెద్దలు పర్యవేక్షించాలి.
- వృద్ధులు, మహిళలు బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.. కుక్కలు కన్పిస్తే గమనించనట్లు వ్యవహరించాలి. మాటిమాటికి వెనక్కి తిరిగి చూస్తే దాడులు చేసే ప్రమాదం ఉంది.

బయటకు వెళ్లాలంటేనే భయం



నాపై పిచ్చికుక్క దాడి చేయడంతో కాలికి తీవ్ర గాయమైంది. బయటకు రావాలంటేనే భయభయంగా ఉంది. పంచాయతీ సిబ్బంది వీధికుక్కల బెడదను నివారించి ప్రజలకు రక్షణ కల్పించాలి. – కటికె వంశీ, కుంటాల

మందులు ఉన్నాయి



కుక్కకాటుకు గురైతే కుంటాల ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు ఉన్నాయి. కుక్కకాటు వేస్తే గాయాన్ని ముందుగా సబ్బుతో బాగా కడిగి వైద్యశాలకు రావాలి. తీవ్ర గాయాలైతే నిర్మల్ పంపిస్తున్నాం. – శృతిరెడ్డి, వైద్యురాలు, కుంటాల

డ్రైవర్లు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

భైంసారూరల్: వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని భైంసా రూరల్ సీఐ నైలు సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని మాటేగాం గ్రామ సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద డ్రైవర్లకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. శిక్షణ తీసుకొని లైసెన్సులు పొందాకే వాహనాలు నడపాలని డ్రైవర్లకు సూచించారు. ఎప్పటికప్పుడు వాహనాల కండిషన్ తనిఖీ చేసుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడుపవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, పోలీసులు, డ్రైవర్లు ఉన్నారు.

కడెం: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎస్సై భీంరావు అన్నారు. గురువారం మండలంలోని కొండుకూర్‌లో ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలీసులు, సిబ్బంది తదితరులున్నారు.



భైంసారూరల్: అవగాహన కల్పిస్తున్న సీఐ నైలు

కుంటాల: ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని భైంసా సీఐ నైలునాయక్ పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని కల్లూర్‌లో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. వారి వెంట ఎస్సై హన్మాండ్లు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన..



నిర్మల్‌లో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై

నిర్మల్‌టౌన్: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, సాయికృష్ణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని దీక్ష జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావద్దని మైనర్లకు సూచించారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

లక్ష్మణచాంద: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి కార్యకర్తలు వివరించాలని ఆ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య అన్నారు. గురువారం మండలంలోని పార్‌పెల్లిలో గావ్‌చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జిల్లా నాయకులు అనిల్, మండలాధ్యక్షుడు గోవర్ధన్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని బెల్‌తరోడాలో బీజేపీ నాయకులు గావ్‌చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. పాఠశాలకు వెళ్లి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని దళిత నాయకుడి ఇంట్లో భోజనం చేశారు. భోజారాం, రాజు, కైలాస్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణచాంద: పార్‌పెల్లిలో కార్యకర్తలతో మాట్లాడుతున్న అయ్యన్నగారి భూమయ్య

కుంటాల: మండలంలోని లింబా(బి),వెంకూర్, పెంచికల్‌పాడ్, మెదన్‌పూర్, అంబుగామ, దౌనెల్లిలో గావ్ చలో అభియాన్ నిర్వహించారు. బీజేపీ నాయకులు కె.అశోక్‌కుమార్, జక్కుల గజేందర్, లక్ష్మణ్‌పటేల్, సాయినాథ్, మల్లారెడ్డి, దత్తుపటేల్, కుబీర్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

సోన్: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామపంచాయతీల అభివృద్ధి జరుగుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసమ్మె రాజు అన్నారు. మండలంలోని పాక్‌పట్ల, కడ్తాల్, సాకెర, కూచన్‌పెల్లి గ్రామాల్లో గావ్‌చలో అభియాన్ నిర్వహించారు. రాచకొండ సాగర్, మార గంగారెడ్డి, అశోక్, ముత్యం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరలో గావ్‌చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. బీజేవైఎం మండలాధ్యక్షుడు మంద గణేశ్, బీజేపీ నాయకులు సాయన్న, సంజీవ్‌రెడ్డి, శ్రీధర్, భూమన్న, చిన్న జేబన్న, లింగయ్య, చిన్నారెడ్డి ఉన్నారు.

చిన్నారి చికిత్సకు సాయం

ఖానాపూర్: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన మగ్గిడి విజయలక్ష్మికి ఇటీవల జన్మించిన కూతురు అనారోగ్యం బారిన పడింది. తమను ఆదుకోవాలని బుధవారం రాత్రి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలోని ఎమ్మెల్యే బొజ్జును చిన్నారి కుటుంబీకులు కలిశారు. మెరుగైన చికిత్స అందేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ వారికి ఇచ్చారు. గురువారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు చిన్నారి తల్లి విజయలక్ష్మి నివాసానికి కాంగ్రెస్ నాయకులు వెళ్లి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నం సత్యం, దయానంద్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, జన్నారపు శంకర్, దండు రాజేశ్వర్, అమానుల్లాఖాన్, శేషాద్రి, కంటం రవి, రాజేందర్, జహీర్ తదితరులు ఉన్నారు.



సాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'జయగోపాల్ మృతి లోటు'

ఖానాపూర్: నాస్తిక సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, అంతర్జాతీయ మానవ హక్కుల నేత డాక్టర్ జయగోపాల్ అకాల మరణం నాస్తిక సమాజానికి తీరని లోటని నాస్తిక సమాజం జిల్లా నాయకులు బొమ్మెన రాజ్‌కుమార్, బానావత్ గోవింద్‌నాయక్, మునుగూరి నవీన్ అన్నారు. గురువారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. 52 ఏళ్లుగా నాస్తిక సమాజం ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కుల, మత, మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి చేశారని పేర్కొన్నారు.

బాబా ఆలయంలో పూజలు

నిర్మల్‌టౌన్: పట్టణశివారులోని గండి రామన్న సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప ప్రాంతాల ప్రజలు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్న హారతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అన్నదాతలు ఎడిపెల్లి అనూష-శ్రీనాథ్‌రెడ్డి, మేకల స్నేహ-కౌశిక్ రెడ్డి దంపతులను ఆలయ ట్రస్ట్ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి సభ్యులు జొన్నల మనోహర్, ఉప్పుల నందు, జిందం గోవర్ధన్, సోమేశ్, రాజేశ్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కల్లూర్‌లో..

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. వివిధ గ్రామాల నుంచి మహిళలు సాయి నామస్మరణ చేస్తూ ఆలయానికి పాదయాత్రగా చేరుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

సన్మానం

కడెం: మండలంలోని ఎలగడప ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఏవో సంధ్యారాణిని గురువారం కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. గ్రామంలోని సమస్యలను ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో అబ్దుల్ రహీ, సలీం, భూమేశ్ తదితరులున్నారు.

తానూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం తాజా మాజీ సర్పంచ్ తాడేవార్ విఠల్, మాజీ ఉపసర్పంచ్ నయూమ్ ఖాన్, వార్డు సభ్యులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి వేణుగోపాల్, మాజీ సర్పంచ్‌లు రాములు, మాధవ్‌రావ్ పటేల్, పుండలిక్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జాబితా అందజేత

నర్సాపూర్ (జి): మండలంలోని రాంపూర్‌లో తుదిఓటరు జాబితాను గురువారం ఆర్ఐ వేణుగోపాల్ బీఎల్ఓలకు అందజేశారు. ఇటీవల నూతన ఓటర్లకు అవకాశం కల్పించడంతో జాబితాలో మార్పులు చోటు చేసుకున్నాయి.

'మా భూములు మాకు అప్పగించాలి'



పట్టాదారు పుస్తకాలతో ఆదివాసీలు

కడెం: కబ్జా చేసిన మా భూములు తిరిగి మాకు అప్పగించాలని మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామానికి చెందిన 20మంది ఆదివాసీలు డిమాండ్ చేశారు. గురువారం చిన్నబెల్లాల్‌లో రైతులు మాట్లాడారు. గోదావరి కుర్రు ప్రాంతంలో ఉన్న సుమారు యాభై ఎకరాలను ఖానాపూర్‌కు చెందిన రవీందర్ రావు కబ్జా చేశారని ఆరోపించారు. ఈ భూముల పట్టాలు మా వద్దే ఉన్నాయని.. మా భూములు మాకు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. ఇందులో లింబరావు, వెంకట్‌రావు, బారిక్‌రావు, గంగు, ఆనంద్ తదితరులు ఉన్నారు.

'గృహజ్యోతి' వివరాలు సేకరణ

సోన్: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం సోన్ నోడల్ అధికారి ప్రభాకర్, ఏఈ శ్రీనివాస్ గృహజ్యోతి పథకానికి అర్హుల వివరాలు సేకరించారు. విద్యుత్ అధికారులు నాలుగు గ్రూపులుగా ఏర్పడి ప్రజాపాలనలో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్న రశీదు, రేషన్, ఆధార్‌కార్డు వివరాలు సేకరించారు. జేఎల్‌ఎంలు గంగాధర్, ఇలియాస్ ఉన్నారు.

ఖానాపూర్: గృహజ్యోతి కోసం విద్యుత్ అధికారులకు వివరాలు అందించాలని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం అన్నారు. గురువారం పట్టణంలో 12వవార్డులో గృహజ్యోతిపై అవగాహన కల్పించారు. ఇంటి వద్దకు వచ్చే విద్యుత్ అధికారులకు, ప్రజాపాలన దరఖాస్తు రసీదు, రేషన్ కార్డు, ఆధార్ జిరాక్స్‌లతోపాటు మీటర్ సర్వీసు నెంబర్ ఇవ్వాలని కోరారు. అంతకుముందు ఒకటో వార్డులో కౌన్సిలర్ కావలి సంతోష్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. షబ్బీర్‌పాషా, ఏఈ తిరుపతి, లైన్‌మెన్ సంజీవ్, సిబ్బంది ఉన్నారు.



సోన్ : న్యూవెల్మల్‌లో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

'16న భారత్‌బంద్ జయప్రదం చేయాలి'

ఖానాపూర్: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మికరైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్ పిలుపు మేరకు ఈనెల 16న కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నూతన్‌కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేశ్ అన్నారు. గురువారం పట్టణంలోని కేఎస్‌ఆర్ కళాశాలలో గ్రామీణ భారత్ బంద్‌పై కార్మికులు, రైతులతో సన్నాహక సదస్సు నిర్వహించారు. సమ్మెలో అన్ని వర్గాల వారు భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు గంగమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూరి తిరుపతి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాధ, అనసూర్య, కమల, రజిత, లక్ష్మి, లత, మమత, సుజాత పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువే పునాది



ముజిగి పాఠశాలలో పరిశీలిస్తున్న డీఈవో రవీందర్ రెడ్డి

- డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: ప్రతీ విద్యార్థికి చదువే పునాది అని, ఇప్పటి నుంచే జాగ్రత్తగా చదివి జీవితంలో మంచి స్థానంలో స్థిరపడాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ముజ్గి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక పరీక్షలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతీరోజు విద్యార్థి హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రత్యేక కార్యాచరణ, ప్రణాళిక ప్రకారం పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు టీవీ, మొబైల్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే విషయాలను శ్రద్ధగా వినాలని, కఠిన అంశాలను ఎక్కువగా అభ్యాసం చేయాలని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సంసిద్ధతపై సూచనలు చేశారు.

నేడు విద్యార్థులకు పోటీలు

నిర్మల్ రూరల్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. పెయింటింగ్, కవిత్వం, సింగింగ్, ఉపన్యాస పోటీలు ఉంటాయన్నారు. సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అనే అంశంపై చెత్తను తగ్గించడం, ఈ- వ్యర్థాలను తగ్గించడం, ఆరోగ్యకరమైన అలవాట్లను దత్తత తీసుకోవడం, సుస్థిరమైన ఆహార వ్యవస్థను దత్తత తీసుకోవడం, ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్‌ను నిషేధించడం, నీటిని పొదుపు చేయడం, శక్తిని కాపాడుకోవడం అంశాలపై పోటీలు ఉంటాయని వివరించారు. ఈనెల 9న అన్ని పాఠశాలలో పోటీలు నిర్వహించి ఒక్కో విభాగంలో ప్రథమ స్థానం సాధించిన నలుగురిని జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. 12న జిల్లా కేంద్రంలోని శాంతినగర్ జీవీఎస్‌ఆర్ పాఠశాలలో ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. ఒక విభాగం నుంచి ముగ్గురు చొప్పున ఉత్తమ స్థానాలు పొందిన మొత్తం 12 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 28న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు చొరవ చూపి కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్‌ను 8919553742 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

సోన్: పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. సిద్దులకుంట, పాక్‌పట్ల జిల్లాపరిషత్ పాఠశాలల్లో ప్రత్యేక పరీక్షలను గురువారం పరిశీలించారు. ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సంసిద్ధం కావాలని సూచించారు. ఉపాధ్యాయులు వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఆదేశించారు. హెచ్‌ఎంలు హరీశ్‌రెడ్డి, వెంకన్న ఉన్నారు.

'రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న కేంద్రం'

నిర్మల్‌చైన్‌గేట్: ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాల రాస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. కేరళ ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ సీపీఎం అఖిల భారత కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు నిర్మల్‌లోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కేరళలో గవర్నర్ ద్వారా మితిమీరిన రాజకీయ జోక్యం, వివక్ష చూపుతుందన్నారు. ఆ రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం సృష్టించి ప్రభుత్వాన్ని కూల్చివేసే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, నిర్మల్ సీపీఎం పట్టణ కార్యదర్శి ఫషియొద్దీన్, పట్టణ నాయకులు అథిక్, అఫ్జల్, బరుకుంట గంగారాం, రాములు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు